పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


మల్కాపూర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

కొండాపూర్,న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం ఆయన కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం, మురుగు కాల్వలను పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. అర్జీల నమోదు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మంత్రి సమ్మతి

జోగిపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విద్యుత్తు శాఖ చీఫ్ ఇంజినీర్ కామేశ్, జోగిపేట డివిజన్ డీఈ శ్రీనివాస్, ఎస్ఈ శ్రీకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అందోలు నియోజకవర్గంలో కొత్త విద్యుత్తు సబ్‌స్టేషన్లు, నియంత్రికలు, లైన్ల ఏర్పాటు తదితర విషయాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారని శ్రీనివాస్ చెప్పారు.

పరీక్ష.. ఆరోగ్యరక్ష

చిన్నారులకు అండగా బాలస్వాస్థ్య

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల ఆరోగ్యపరిరక్షణకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పిల్లల్లో కనిపించే స్వల్ప అనారోగ్య లక్షణాలు, దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా బడుల్లోనే పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడం ఆర్‌బీఎస్‌కే లక్ష్యం. పిల్లలకు ఆరోగ్యంపై సరైన అవగాహన లేకపోవడంతో వివిధ రకాల రుగ్మతలు వారిని చుట్టుముడతాయి. వాటి నుంచి రక్షణ కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జబ్బులను గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటారు. పరికరాలు అవసరమైతే ఎన్‌జీవోస్ సహకారం, దాతల ద్వారా ఉచితంగా అందజేసేందుకు కృషి చేస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు 97 శాతం పరీక్షలు చేసినట్లుగా వైద్యాధికారులు గుర్తించారు.


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

విద్యార్థుల వద్దకు వైద్యులు:

ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ఆర్‌బీఎస్‌కేకు చెందిన తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశారు. అందులో 18 మంది వైద్యులు, తొమ్మిది మంది చొప్పున ఫార్మాసిస్టులు, ఏఎన్‌ఎంలు ఉంటారు. వీరు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారికి అవసరమైన సలహాలు సూచనలు అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలకు ఏడాదికోసారి, అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదిలో రెండు సార్లు వైద్య బృందం వెళుతుంది. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇస్తారు. వారి తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాచారం చేరవేస్తారు. ఆరోగ్య పరిస్థితి ప్రకారం పీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రి, జిల్లా జనరల్ ఆసుపత్రిలో, డిస్ట్రిక్ ఎర్లి ఇంటర్‌వర్షన్ సెంటర్ (ఆర్‌బీఎస్‌కే) పరిధిలో ఉచిత ఆరోగ్య పరీక్షలు చేస్తారు.

లోపాల గుర్తింపు (జనవరి నుంచి అక్టోబరు 18వరకు)

- పుట్టుకతో: 485
- దంత: 852
- కంటి: 221
- చెవి వినికిడి: 1,491
- బాలికల నెలవారీ సమస్యలు: 123
- అపరిపక్వత: 55
- రక్తహీనత: 182
- పోషకాహారలోపం: 152
- చర్మ సంబంధం: 320
- మానసిక రుగ్మత: 232
- ఇతరాలు: 132

జిల్లాలో ఇలా

అంగన్‌వాడీ కేంద్రాలు:	1,504
ఒకటి నుంచి ఇంటర్ వరకు విద్యాసంస్థలు:	1,292
ఆరోగ్య పరీక్షలు చేయాల్సిన విద్యార్థులు:	2,38,266
పరీక్షలు చేసింది	2,32,287
శాతం	97

భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా..



ఆరోగ్య పరీక్షల్లో పిల్లల లోపాలను గుర్తించి, వారికి వైద్య సేవలు అందిస్తాం. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వారికి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా అవగాహన కల్పిస్తున్నాం. – శశాంక్ దేశ్‌పాండే, సమన్వయకర్త.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం: కలెక్టర్


సమీక్ష నిర్వహిస్తున్న వల్లూరు క్రాంతి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు ఫెన్సింగ్, వాటి పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. చెరువులను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సాయిబాబా, సర్వే శాఖ ఏడీ ఇనేష్, ఆర్డీవో రాజు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షకు సన్నాహాలు: నవంబరులో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లపై రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17వేల మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. 49 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారని చెప్పారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు రెండు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏటీసీ కేంద్రాలతో సత్వర ఉపాధి: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)తో సత్వర ఉపాధి సాధ్యమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం ఏటీసీ కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియపై ఉపాధి కల్పన శాఖ కార్యదర్శి సంజయ్ జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాల్లో ఈనెల 30వరకు ప్రవేశాలకు గడువు ఉందన్నారు. అర్హులందరూ ప్రవేశాలకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు.

నిత్యం ఒక సంచి మట్టి.. దారి బాగుకు నడుంకట్టి..



ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కొందరు సమస్యల పరిష్కారానికి ముందుకు వస్తారు. అది తమ బాధ్యతగా భావిస్తారు. పోచారం గ్రామానికి చెందిన మున్నూరు ఆంజనేయులు కూడా అదే బాటలో పయనిస్తున్నారు. పుల్కల్ మండల పరిధి ముద్దాయిపేట చౌరస్తా నుంచి పోచారం వరకు మూడు కిలోమీటర్ల పరిధిలో రోడ్డుపై గుంతలు పడ్డాయి. వీటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన ఆంజనేయులు నిత్యం ఒక సంచిలో మట్టిని తీసుకెళ్లి గుంతల్లో పోసి చదును చేస్తున్నారు. పెద్దారెడ్డిపేట మిషన్ భగీరథ ప్లాంటులో ఆపరేటర్‌గా పని చేస్తున్న ఆయన, విధులు ముగియగానే దారిలో సంచిలో మట్టి నింపుకొని గుంతలను పూడుస్తున్నారు. నెల రోజులుగా ఈ పనిని దినచర్యగా మార్చుకున్నారు. తన వల్ల వాహనదారులకు కొంత ఉపశమనం లభించినా తనకు సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే పుల్కల్.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో జంగారెడ్డి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అదనపు డీఆర్డీవో జంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొడ్డురకం సేకరణకు 80, సన్నాల సేకరణకు 8 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రైతులకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేస్తున్నామని, కేంద్రాల్లో కనీస వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కొండల్‌రావు, డీపీఎం జయశ్రీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి నోచక.. ఉద్యానంలో నాటక..



పట్టణాల్లో పచ్చందాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోంటే, క్షేత్రస్థాయిలో అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొంది. పట్టణంలోని వివిధ కాలనీల్లో పంచేందుకు మొక్కలను తెచ్చి రాజీవ్ పార్కులో నిలువ ఉంచారు. వీటిలో కొన్ని పంపిణీ చేసినా, వందకుపైగా మొక్కలు వృథాగా పడేశారు. వాటిని పార్కులో నాటినా వృక్షాలుగా ఎదిగేవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ.

21 హత్నూర ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

హత్నూర, న్యూస్‌టుడే: హత్నూర గురుకుల పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ఈనెల 21న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.వి.సుబ్బలక్ష్మి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వృత్తివిద్యా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని సరైన ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపికచేసి పరిశ్రమల్లో శిక్షణ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బాల,బాలికల వెయిట్ లిఫ్టింగ్ అండర్ -17 ఎంపికలు స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 15 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ తెలిపారు.

పోటీ.. సృజనాత్మకతతో మేటి

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ



పోలీసు అమరుల సంస్మరణ ఉత్సవాల నేపథ్యంలో ఆ శాఖ పలు పోటీలకు తెర తీసింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వేదికగా ఎంతో మంది చిన్న వీడియోలు, చిత్రాలు తీస్తూ తమ సృజనాత్మకతను చాటుకుంటుంటారు. ఇలాంటి వారి ప్రతిభను వెలికితీయడమే ధ్యేయంగా పోలీసు శాఖ ఈ పోటీలను నిర్వహిస్తోంది.

తాజాగా తీసినవి..

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఆ శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఫొటో, వీడియోగ్రాఫర్లు, విద్యార్థులతో పాటు పోలీసులకు పోటీలు చేపడుతోంది. పోలీసుల త్యాగాలను, విధుల్లో ప్రతిభను చాటేలా తాజాగా తీసిన 3 చిత్రాలు, 3 నిమిషాల నిడివి ఉన్న లఘుచిత్రాలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలోని పీఆర్వోకు అందించాలి. వాటి నుంచి బాగున్నవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

ఏయే అంశాల్లో..

మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో రక్షకుల సేవ, ఇతర సందర్భాల్లో వారి కీర్తి ప్రతిష్ఠలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు ఇలా లఘుచిత్రాలకు అంశాలుగా నిర్దేశించారు. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు తీసిన లఘుచిత్రాలను మాత్రమే పోటీలకు ఈ నెల 20 లోపు పంపించాల్సి ఉంటుంది.

అంతర్జాలంలో వ్యాసరచన

ఇంటర్ వరకు విద్యార్థులకు విచక్షణతో కూడిన చరవాణి వినియోగం, డిగ్రీ ఆపై వారికి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అంశాలపై అంతర్జాలం వేదికగా వ్యాసరచన పోటీలు ఉంటాయి. అక్టోబరు 25 లోపు పంపించాలి.

పోలీసు సిబ్బందికి..

కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్ఠ మెరుగుపరచడంలో నా పాత్ర, ఎస్సై నుంచి పై స్థాయి అధికారులకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో రాయవచ్చు.

త్యాగాలను స్మరిస్తూ..: అనూరాధ, సిద్దిపేట సీపీ



అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం.

ఫుట్‌బాల్‌లో రాణించేలా.. జాతీయస్థాయిలో ఆడేలా..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దడమే ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్) లక్ష్యం. సాత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీతో కలిసి ఆటగాళ్ల ఎంపికకు పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ నెల 19న మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపడుతోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూర్, కోల్‌కతా, చెన్నై, దిల్లీ వంటి ప్రధాన పట్టణాల్లోనే ఈ తరహా ఎంపికలు జరిగాయి. రాష్ట్రంలో మెదక్‌లో (శనివారం), వరంగల్‌లో (నవంబర్ 3న) జరుగనున్నాయి.

శిక్షణ ఇచ్చి..

ప్రోత్సాహం లేక రాణించలేకపోతున్న పట్టణాలు, గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టారు. దేశంలోని ప్రముఖ అకాడమీల్లో తర్ఫీదు పొందవచ్చు. విదేశీ అకాడమీలలోనూ చేరవచ్చు.

ఎంపిక తీరు..

మూడు దశల్లో ఎంపికలు కొనసాగుతాయి. తొలి దశలో మెదక్, వరంగల్ జిల్లాల్లో పోటీలు జరుగుతాయి. ప్రతిభ చూపిన వారిని రెండో దశ రీజనల్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ పోటీలను బెంగళూర్‌లో నిర్వహించనున్నారు. మెరుగైన ఆట చూపిన వారిని మూడో దశ (జాతీయ స్థాయి)లో ఆడే అవకాశం దక్కుతుంది. ఇవి న్యూదిల్లీలో జరుగుతాయి.

తొలిసారిగా..



జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను తీర్చిదిద్దే లక్ష్యంతో మూడేళ్లుగా ఐకేఎఫ్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు చేపడుతున్నాం. తొలిసారిగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వారికి సైతం ఈ తర్ఫీదు అందించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నాం.

విష్ణుతేజ, సాత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ సహ వ్యవస్థాపకుడు, హైదరాబాద్

పారితోషికం..

శిక్షణ సమయంలో విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. పారితోషికం సైతం చెల్లిస్తారు. పలు క్లబ్‌లకు ఆడిస్తూనే, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడేలా తీర్చిదిద్దుతారు. ఉమ్మడి మెదక్, సమీపంలోని జిల్లాలకు చెందిన అండర్-13, 15, 17 బాలబాలికలు ఇందులో పాల్గొననున్నారు.



మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియం

సదవకాశం:

ఫుట్‌బాల్‌లో రాణించాలనుకునే వారికి సదవకాశం. ప్రముఖ అకాడమీలలో ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా శిక్షణ పొందే అవకాశం దక్కుతుంది. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడవచ్చు. **ప్రకాశ్, మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ శిక్షకుడు**


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



శంకర్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఎలుకపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ సాదాత్‌మియా తెలిపిన వివరాలు.. ఎలుకపల్లికి చెందిన కానికే శంకర్(22) తల్లి గతంలో మృతి చెందడంతో తండ్రి వెంకటేశ్.. దుర్గమ్మను పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఏడాది క్రితం వెంకటేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ తన పినతల్లి దుర్గమ్మ వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సమస్యలపై దుర్గమ్మతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్ రాత్రి 11 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అన్ని చోట్ల వెతికినా జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉండడం గ్రామస్థులు గమనించారు. శంకర్ సోదరి శైలజ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.


కుటుంబ కలహాలతో మరొకరు..



రాజు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వల్లపు రాజు(35) కొన్నాళ్లుగా గుమ్మడిదలలో అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల కిందట ఆయనకు గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన లక్ష్మీతో రెండో వివాహమైంది. ఇటీవల కుటుంబ కలహాలు చెలరేగాయి. భార్యతో గొడవ జరగడంతో ఆయన మామ రాజు ద్విచక్ర వాహనం తీసుకెళ్లాడు. దీనికి మనస్థాపానికి గురైన రాజు శుక్రవారం మధ్యాహ్నం ఆయన సోదరుడు మహేశ్‌కు ఫోన్‌చేసి బాధగా మాట్లాడారు. తదుపరి పక్కింటి వారు ఫోన్‌చేసి రాజు ఇంట్లో ఉరి వేసుకున్నాడని చెప్పడంతో ఆయన సోదరుడు, తల్లి మల్లమ్మ వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



శివసాయి

మెదక్ రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని అవుసులపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన నాగారం రాజయ్య, లక్ష్మి కుమారుడు శివసాయి(23) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. రాజయ్య సుమారు 20ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి పోషిస్తోంది. గురువారం రాత్రి తల్లి లక్ష్మి, ఆమె అక్క భర్త రవి, కుమారుడు శివసాయి మద్యం తాగారు. తర్వాత రవి వారి ఊరికి వెళ్లిపోయాడు. కొంతసేపటికి కుమారుడు లేడని చుట్టుపక్కల వారికి చెప్పి వెతికింది. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూస్తే అతను గడ్డి పక్కన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే స్థానికులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లే చంపిందని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. తల్లి, ఆమె అక్కపై గ్రామస్థులు దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఇద్దరినీ ఠాణాకు తరలించారు. కేసు నమోదైంది.

ప్రమాదవశాత్తు నీటమునిగి ఒకరి మృత్యువాత



గణేష్

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన ప్రకారం.. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బేగరి గణేష్(45) రెండు రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. చెరువు వద్ద చూసినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం చెరువులో నీటిపై తేలింది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వరికోత వాహనం ఢీకొని చిరువ్యాపారి..

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: వరికోత వాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరీఫ్ గత ఏడాది ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నాడు. మంబోజిపల్లి మార్కెట్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శుక్రవారం అక్కడే బండి పెట్టుకోగా వెనుక నుంచి వచ్చిన వరికోత వాహనం ఢీకొనడంతో కిందపడిపోయాడు. అతన్ని భార్య మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. డ్రైవర్ కాశ్మీర్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గేదెను తప్పించబోయి రైతు దుర్మరణం

చిలప్‌చెడ్: గేదెను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి రైతు దారబోయిన వీరేశం(49)మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మిస్బోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరేశం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా చిట్కుల్ గ్రామ శివారులో దారిపైకి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దానిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో వీరేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 120–00	డ్రెస్డ్	206–00
రిటైల్ 142–00	స్కిన్‌లెస్	234–00

మా ఊరికి మహాలక్ష్మి వచ్చింది!

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గుడుపల్లి, ఔరంగ్‌నగర్, గౌసాబాద్ తదితర గ్రామాల మీదుగా నడిచే ఆర్టీసీ బస్సు ఐదేళ్ల కిందట నిలిచిపోయింది. సరైన ఆదాయం రాకపోవడంతో సంబంధిత అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్సు ఎక్కేవారు. లేదంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ క్రమంలో గురువారం జహీరాబాద్‌లో పర్యటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డా. ఏ.చంద్రశేఖర్ మొగుడంపల్లి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. జహీరాబాద్ డిపో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శుక్రవారం బస్సు సర్వీసును షురూ చేశారు. పదమూడు గ్రామాల ప్రజలకు ఊరట దక్కింది. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు రాకపోకలు సాగించనుంది. ఇక మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకునే అవకాశం చిక్కింది.



- న్యూస్‌టుడే, మొగుడంపల్లి (జహీరాబాద్ అర్బన్)

పాములన్నీ ప్రమాదకరం కాదు

ములుగు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ' ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విష సర్పాలు, విషంలేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అటవీ కళాశాల పరిశోధన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎస్.ఎస్.శ్రీనిధి మాట్లాడుతూ సమాజంలో సర్పాలంటే అందరికీ ఎంతో భయం ఉంటుంది. పాములన్నీ ప్రమాదకరమైనవి కావని, కొన్ని మాత్రమే విషపూరితమైనవన్నారు. అనేక రకాల సర్పాలు పంటలను నాశనం చేసే ఎలుకలు, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సర్పాన్ని ప్రదర్శిస్తూ వివరిస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు

కాటేసిన కాలువ

ఆరు నెలల్లోనే నీటిలో పోయిన తండ్రి, కుమారుడి ప్రాణాలు



యాదగిరి

గజ్వేల్ గ్రామీణ: ఆరు నెలల క్రితం కుమారుడు కాలువలో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు తండ్రి అందులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. వరుస విషాదాలతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సీఐ సైదా తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాతర్‌పల్లి- రిమ్మనగూడ మధ్యలోని కొండపోచమ్మ జలాశయం కాలువలో వ్యవసాయ కూలీ గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దాతర్ పల్లి కి చెందిన నాయిని యాదగిరి (40)కి భార్య వాణి, కుమార్తె ఉన్నారు. యాదగిరి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం కాలువలో మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చాటుగా ప్రేమ వివాహం.. వరుడి ఇంటిపై దాడి

రాయపోల్, న్యూస్‌టుడే: ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం టెంకంపేటలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యువకుడు (19), యువతి (20) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. అక్కడ వారికి పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడం, యువకుడికి చట్టప్రకారం పెళ్లీడు వయసు రాకపోవడంతో వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. ఈనెల 17న హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లి వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరూ వచ్చారు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు.. వరుడి ఇంటికి వెళ్లి పెంకులు, రేకులు ధ్వంసం చేశారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

21న డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: డీసెట్ ర్యాంకు సాధించి పలు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులకు ఈ నెల 21న హవేలిఘనపూర్‌లోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో తిరిగి పరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు డైట్ ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. అభ్యర్థులు ర్యాంకుకార్డు, డైట్ సెట్ హాల్‌టికెట్, పది, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు బోనఫైడ్లు, ఇంటిగ్రేటెడ్ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రత్యేక విభాగాల ధ్రువపత్రాలు (ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులు, సైన్యంలో విధులు) తీసుకురావాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు మీ సేవా కేంద్రాల్లో వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలని, వీలైనన్ని ఎక్కువ కళాశాలలు ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. 30న సీట్లు కేటాయిస్తామని, నవంబరు 3లోపు ప్రవేశం పొంది, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది, 4న కేటాయించిన కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాల్సి ఉంటుందని వివరించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



మమత

పుల్కల్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన చౌటకూరు మండల హొన్నాపూర్ వద్ద శుక్రవారం జరిగింది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం మండలంలోని గంగోజిపేటకు చెందిన కాశపాగ మమత (30)కు ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్ని రోజులుగా భర్తకు దూరమై పుట్టింట్లో ఉంటోంది. సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ ఆసుపత్రి భోజనశాలలో హెల్పర్‌గా పని చేస్తోంది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి విధులకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. శుక్రవారం హొన్నాపూర్ జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరి పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కళా ఉత్సవ్ పోటీల్లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుబ్బాక, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆరు విభాగాల్లో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు ఎ.చామంతి ఏకపాత్రాభినయంలో, సీహెచ్ యశ్వంత్ వాద్య సంగీతంలో, క్రాంతి కుమార్ చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గైడ్ టీచర్లను ఎంఈవో ప్రభుదాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నలుగురిలో దూషించాడని.. మద్యం తాగించి మిత్రుడి హత్య



వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, పక్కన మద్దూరు ఎస్సై మహబూబ్

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: మహిళలు సహా పలువురి ఎదుట అవమానకరంగా దూషించడంతో కోపం పెంచుకున్న మిత్రుడు కక్ష పెంచుకొని మద్యం తాగించి హత్య చేశాడు. సిద్దిపేట జిల్లా ధూళ్మిట్ట మండలం కూటిగల్ శివారులో ఈనెల 15న అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి (48) కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం మద్దూరు ఠాణాలో జరిగిన సమావేశంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను వివరాలు వెల్లడించారు. ఈనెల 14న బెక్కల్‌కి చెందిన బైరగోని లక్ష్మి మద్దూరు స్టేషన్‌లో తన భర్త యాదగిరి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజే కూటిగల్ శివారులో యాదగిరి మృతదేహం లభ్యమైంది. హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు మహబూబ్, నీరేశ్, రాజు ఆధ్వర్యంలో మూడు బృందాలు దర్యాప్తు చేశాయి. బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణను అనుమానితుడిగా భావించి, అతని కోసం గాలిస్తుండగా శుక్రవారం మద్దూరు మండలం ఉప్పరోనిగడ్డ శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈనెల 13న బెక్కల్‌లో అవమానిస్తూ యాదగిరి తిట్టడంతో బాలకృష్ణ కోపం పెంచుకున్నాడు. అంతుచూడాలని భావించిన బాలకృష్ణ.. అదే రోజు సాయంత్రం యాదగిరిని బైక్‌పై తీసుకెళ్లి మద్యం తాగించాడు. మత్తులో ఉండగా కర్రతో తలపై బాది హత్య చేశాడు. బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కేసు ఛేదించిన ఎస్సైలను, సిబ్బందిని సీఐ అభినందించారు. సీసీ కెమెరాలు ఉండటంతో కేసు ఛేదనకు తోడ్పడ్డాయని తెలిపారు.

బంగారు బాల్యానికి.. పంచసూత్రం!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యాచరణ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, తాండూరు

నేటి బాలలు.. రేపటి భావిభారత పౌరులు. బంగారు భవితకు బాటలు పడేది ప్రాథమిక దశలోనే. ఈ తరుణంలో వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆయా సేవలకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా పోషణ లోపంతో పలువురు బాధపడుతున్నారు. వారిని సంపూర్ణ ఆరోగ్యులుగా తీర్చిదిద్దే క్రతువులో భాగంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చిన్నారుల అభ్యున్నతికి పంచసూత్రాల అమలుకు శ్రీకారం చుట్టడం విశేషం.

మార్పు తీసుకొచ్చే లక్ష్యంతో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 9, వికారాబాద్ జిల్లాలో 5 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 4,837 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. చిన్నారులకు అధిక పోషకాలున్న బాలామృతం అందిస్తున్నారు. ఎవరికైనా పోషణ లోపం ఉంటే వారిని వైద్యుల వద్దకు తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ మార్పు తెస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాల వారిని గుర్తించి పూర్వప్రాథమిక స్థాయి విద్యను అందిస్తూ.. కావాల్సిన ఆహారం సమకూర్చుతున్నారు.

	ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు
సంగారెడ్డి	5	1,504
మెదక్	4	1,076
సిద్దిపేట	5	1,150
వికారాబాద్	5	1,107



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పక్కాగా అమలుచేస్తున్నాం: లలిత కుమారి, జిల్లా సంక్షేమాధికారిణి, సంగారెడ్డి

చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పంచసూత్రాలు పక్కాగా అమలయ్యేలా చూస్తున్నాం. పోషణలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం.

పంచసూత్రాలు ఇలా..

1000 రోజుల ప్రణాళిక

జిల్లాల్లో పోషణ లోపం కలిగిన చిన్నారులపై ప్రత్యేక కార్యక్రమం. 1000 రోజుల పాటు ఇది కొనసాగుతుంది. చిన్నారుల్లో మార్పునకు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

పౌష్టికాహారం తినడం

చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలకు పోషణలోపమే ప్రధాన కారణం. బాల్యదశలో సమతుల ఆహారం అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించడంతో పాటు ఇంటి వద్ద కూడా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేస్తున్నారు.

రక్తహీనత నివారణ

పలువురు చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతోంది. ఇలాంటి వారిని గుర్తించి.. పౌష్టికాహారం అందిస్తారు.

డయేరియాకు దూరంగా..

కలుషిత నీరు, ఆహారం తదితర కారణాలతో చిన్నారులు డయేరియా బారినపడుతున్నారు. ఫలితంగా శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి చేయిదాటే ప్రమాదం లేకపోలేదు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, ఒకవేళ అతిసారం బారినపడితే ముందడుగు వేయాల్సిన తీరుపై సూచనలు చేస్తున్నారు.

శుచి, శుభ్రత

శుచి, శుభ్రత పాటించకపోతే రోగాలు ప్రబలే ఆస్కారం ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. చేతుల శుభ్రతతో ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు తరచూ చేతులను శుభ్రం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లి గ్రామానికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. తమతో ఉంటున్న భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ప్రమాదకర గుంత పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

కోహీర్: కోహీర్- రాజనెల్లి రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పంచాయతీ సిబ్బంది పూడ్చేశారు. ‘మళ్లీ అక్కడే గుంత.. తీరని చింత.!’ అనే శీర్షికన ఈనెల 16వ తేదీన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి అధికారులు శుక్రవారం స్పందించారు. గుంతలో కంకర నింపి రాకపోకలు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశారు.

వేప చెట్టు నుంచి కల్లు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: సామాన్యంగా ఈత, తాటిచెట్టుకు కల్లు రావడం అందరికీ తెలిసిందే. పట్టణంలోని పురపాలక దుకాణ సముదాయంలోని వేపచెట్టు నుంచి కల్లు ధారగా వస్తోంది. కొందరు అక్కడ కుండ కట్టారు. అది నిండగానే మరోటి కడుతున్నారు. వేపచెట్లు తెల్లటి ద్రవాన్ని విడుదల చేస్తాయని స్థానికంగా ఉండే ఓ వృక్షశాస్త్ర అధ్యాపకురాలు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

ఉద్యోగ మేళాకు ఆయుధ కర్మాగారం ప్రతినిధులు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: కర్ణాటక మాండ్యాలో నిర్వహించిన మేగా ఉద్యోగ మేళా-2024లో కంది మండలం ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు. తమ పరిశ్రమలో ఉండే అవకాశాలను వివరించారు. ఉద్యోగాలు, సాధించేందుకు ఉండాల్సిన అర్హతలపై అవగాహన కల్పించారు.

పార్కులు అధ్వానం.. ఆహ్లాదం కరవు!

నిధులు కేటాయించినా వినియోగలేమి

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

- పట్టణం: సంగారెడ్డి
- పార్కుల సంఖ్య: 14
- జనాభా:1.20 లక్షలు

పురపాలికల్లో పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణ ప్రగతి కింద రూ.కోట్ల నిధులతో పార్కులు వార్డుల్లో ఏర్పాటు చేసిన నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు ఒక్క పార్కు కూడా సరిగా లేకపోవడంతో ఇంటికే పరిమితం అవుతున్నారు. రాజీవ్ పార్కు అభివృద్ధికి గతంలో రూ.50 లక్షల నిధులు కేటాయించిన పనులు చేయలేదు. దీంతో సమస్యలు దర్శనమిస్తున్నాయి. పార్కు



నడక దారి దుస్థితి



రాజీవ్ పార్కులోని ఫౌంటేయిన్ దుస్థితి

అభివృద్ధి చేయాలని కౌన్సిలర్లు సమావేశాల్లో అనేకసార్లు విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ‘న్యూస్‌టుడే’ కథనం.

సంగారెడ్డి పట్టణంలోని 38 వార్డుల్లో మొత్తం 1.20 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేసేందుకు ఒక్క పార్కులో కూడా కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొత్త బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్కు రూ.2 కోట్లతో నిర్మించారు. అధికారుల నిర్వహణ సరిగా లేకపోవడంతో పార్కులో ఉన్న మూడు ఫౌంటేయిన్లు పాడయ్యాయి. నడకదారిలో పొదలు పెరిగాయి. జిమ్ పరికరాలు పూర్తిగా పాడయ్యాయి. చిన్నపిల్లల ఆట వస్తువులు కూడా విరిగిపోయాయి. గతంలో పార్కులో పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 వసూలు చేసేవారు. పార్కు అధ్వాన్నంగా మారడంతో రెండేళ్లుగా రుసుము వసూలు చేయడం లేదు. పార్కు అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు ఎస్‌డీఎఫ్ కింద కేటాయించిన పనులు చేయలేదు. అభివృద్ధి చేస్తే రోజుకు రూ.10 వేల వరకు పురపాలికకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. రూ.30 లక్షలతో నిర్మించిన చాణక్యపురి కాలనీ పార్కును ఇంకా ప్రారంభించలేదు. మంజీర నగర్, తదితర కాలనీల్లోని పార్కుల నిర్వహణ సరిగా లేకపోవడంతో తీగ మొక్కలు పెరుగుతున్నాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పార్కులు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

పట్టణంలోని రాజీవ్ పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. గతంలో నిధులు మంజూరైన నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు చేయలేదు. పట్టణంలోని మిగిలిన పార్కులు బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)

సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట

? సంగారెడ్డిలోని రాజంపేటలో చెత్త సేకరణ సిబ్బంది సరిగా రావడం లేదు. అధికారులు సమస్య పరిష్కరించాలి. **– గోపాల్, సంగారెడ్డి**

✓ క్రమం తప్పకుండా వెళ్లాలని చెత్త సేకరణ సిబ్బందికి సూచనలు చేస్తాం. **– సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సంగారెడ్డి.**

? పోతిరెడ్డిపల్లిలోని బ్యాంక్ కాలనీలో మంచినీళ్లు పూర్తిస్థాయిలో రావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. **– సంతోష్, సంగారెడ్డి.**

✓ ప్రతిరోజు గంటపాటు మంచినీళ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. **– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.**

? అక్సానిపల్లి శివారులోని పెద్దారెడ్డిపల్లెకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల మలుపుల వద్ద పొదలు ఏపుగా పెరిగాయి. వాటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. **-జోగయ్య, తాల్మెల్మ.**

✓ రహదారికి ఇరువైపుల పెరిగిన పొదలు శుభ్రంచేయిస్తాం.

-రవీందర్ డిప్యూటీ ఈఈ ర.భ శాఖ అందోలు.

? జోగిపేట జోగినాథ స్వామి ఆలయం వెనకాల కాలనీలో అంతర్గత దారులు సరిగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **-కిషన్, జోగిపేట.**

✓ అవసరం మేరకు కాలనీలో సీసీ దారులు నిర్మించి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం. **-తిరుపతి, కమిషనర్ అందోలు- జోగిపేట.**

? జోగిపేట పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో ఉన్న మొబైల్ మరుగుదొడ్ల వాహనం నిరుపయోగంగా మారింది. సంత రోజున వివిధ పనులపై బైటకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. **-ప్రసాద్, జోగిపేట.**

✓ మొబైల్ మరుగుదొడ్డి వాహనాన్ని బాగు చేయిస్తాం. సంత రోజున దానిని ప్రధాన కూడలిలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటాం.

-తిరుపతి, కమిషనర్, అందోలు- జోగిపేట.

? జోగిపేట పట్టణంలోని 11, 12 వార్డుల్లో నుంచి అన్నాసాగర్ చెరువు వరకు ఉన్న కట్టు కాలువలో పైపులు పరిచారు. కానీ దానిపై సరైన మట్టివేసి పూడ్చకపోవడంతో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. **-నరేశ్, జోగిపేట.**

✓ కాలువను పరిశీలించి ప్రమాదాలు నివారిస్తాం.

-మజర్, ఏఈ, అందోలు.

నియంత్రికకు రక్షణ మరిచారు!



సిరిపుర ఊరి మధ్యలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. కనీస రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా రెండు గొర్రెలు మృతి చెందాయి. నిత్యం అటుగా వెళ్లే ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ ఏర్పాట్లు కల్పించాలని స్థానికులు కోరారు. – న్యూస్‌టుడే, హత్నూర.

ప్రతిభచాటి... విజేతలుగా నిలిచి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు

జహీరాబాద్: జహీరాబాద్ ‘ఆదర్శ విద్యాలయం’లో శుక్రవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ‘ప్రతిభా పాఠవ పోటీలు’ నిర్వహించారు. ‘మొబైల్ ఫోన్ వినియోగం వల్ల లాభాలు ఉన్నాయా?’ నష్టాలున్నాయా? మీకు ఎదురైన అనుభవాలు’ అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చక్కగా వ్యాసం రాసి విజేతలుగా నిలిచిన సుసన్న, బి.అక్షయ, పరమేష్‌లకు ఆ పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కల్వ చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ముప్పిడి శ్రీనివాస్, ఎం.ప్రవీణ్‌కుమార్, పద్మావతిరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల భాగస్వామ్యం ప్రధానం



సభ్యత్వ నమోదులో జావిద్‌అలీ తదితరులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంఘం బలోపేతానికి ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఉద్యోగుల సభ్యత్వ నమోదు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య పొదలు.. తప్పని తిప్పలు



జిల్లా కేంద్రం అన్న మాటే. సంగారెడ్డి పట్టణ వాసులకు నిత్యం సమస్యలతో సహవాసం తప్పడం లేదు. కాలనీల్లో ఇళ్ల మధ్య పొదలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని వీరభద్రనగర్, రాజంపేట, నలందానగర్, విజయ్‌నగర్ తదితర కాలనీల్లో ఈ సమస్య అధికంగా ఉంది. వీటి వల్ల దోమల బెడదతో రాత్రిపూట కంటిమీద కునుకులేకుండా పోయిందని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్లలోనూ ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల పాములు సంచరించడంతో భయంభయంగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

సక్రమంగా విధులు నిర్వహించాలి

సిర్గాపూర్: ఇటీవల మండలంలో విధుల్లో చేరిన 24 మందికి విధులు, సమయపాలన, బోధన, దస్త్రాల నిర్వహణ తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించినట్లు ఎంఈఓ నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. హెచ్‌ఎం మంజుల, వెంకటేశం, ఎంఐఎస్ స్వప్న, సీఆర్పీలు ప్రకాష్, శివకుమార్, క్రాంతి, రవీందర్‌లు పాల్గొన్నారు.

● కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ సిర్గాపూర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘ బాధ్యులు నర్సింగ్ మాట్లాడుతూ... విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ, వారి ఉన్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగారం శ్రీనివాస్, హెచ్‌ఎం మంజులాదేవి, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశం, లక్ష్మణ్, నర్సుగౌండ, నవీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల: కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను గుమ్మడిదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా స్వాగతించారు. ప్రార్థనకు ముందు మేళతాళాలు, చప్పట్లతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే సమాజ శ్రేయస్సు



ఓటు నమోదు పత్రం అందజేస్తున్న రమేష్

మనూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శ్రేయస్సే సమాజ శ్రేయస్సని నాగల్‌గిద్ద మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దామర్‌గిద్ద, కారాముంగి, కరస్‌గుత్తి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి నాగ్‌నాథ్, నాయకులు గణేష్, విజయేందర్‌రెడ్డి, సూర్యకాంత్, బసవరాజ్, జీవన్, వెంకటలక్ష్మీ, జ్యోతి, శ్వేత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆర్థిక సర్వేకు ఏర్పాట్లు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఆర్థిక సర్వేకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రతి 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించేలా చర్యలు తీసుకుంటున్నారు. పదిమంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌గా మండలస్థాయి అధికారిని నియమిస్తారు. పటాన్‌చెరు మండలవ్యాప్తంగా 14 వేల కుటుంబాలున్నట్టు గుర్తించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించేందుకు వీలుగా 99 మంది ఎన్యుమరేటర్లను నియమిస్తారు. ఇందుకు గ్రామాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే బిల్‌కలెక్టర్లు, కారోబార్లను వినియోగిస్తారు. వీరిని మండల స్థాయిలో ఎంపీడీఓ, ఎంపీఓలు పర్యవేక్షిస్తారు.

అర్హులందరికీ రేషన్ కార్డులివ్వండి

నారాయణఖేడ్: అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖేడ్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించినా పంపిణీ చేయలేదన్నారు. పార్టీ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్, నాయకులు సతీష్ పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

ఝరాసంగం: ఝరాసంగం ఎస్సీ బాలుర బాలికల వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ సహాయ అధికారి శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రత, భోజనం, దస్త్రాలు పరిశీలించి వార్డెన్లకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు వెంకటేశం చంద్రమ్మ ఉన్నారు.

పాఠశాలలో పాము కలకలం!

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలలో గదిలోనికి శుక్రవారం పాము రావడంతో విద్యార్థులు కేకలు వేసిన ఘటన సంగారెడ్డి పట్టణ పరిధిలోని హౌస్టల్‌గడ్డలో శుక్రవారం నెలకొంది. వెంటనే గమనించిన ఉపాధ్యాయులు విద్యార్థులను బయటకు పంపించి కర్రల సాయంతో పాము బయటకు వెళ్లిపోయేలా చేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు వాపోయారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని మిషన్ భగీరథ ఈఈ ఎస్‌కే పాష సూచించారు. శుక్రవారం సంగారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో సంగారెడ్డి, కంది మండలాలకు చెందిన గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగిల్, త్రీఫేజ్ మోటార్లు, చేతి పంపుల మరమ్మతుల తీరును వివరించారు. కార్యక్రమంలో ఏఈలు రవికుమార్, ఎస్.ప్రసన్న, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుల్కల్, న్యూస్‌టుడే: సింగూర్ మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో 8, 9, 10 తరగతులకు భౌతికశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆగమయ్య తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఎడ్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

మనూరు, న్యూస్‌టుడే: ఇరవై ఏళ్లుగా కోర్టులో కేసు కొనసాగుతుందని, ఈ భూమిని ఇతరుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయవద్దని చెప్పినా... అక్రమంగా చేశారని నిరసిస్తూ శుక్రవారం సీపీఐ నాయకుడు గణపతితో కలిసి బాధితులు జగమ్మ, నర్సమ్మలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

‘ఛఠ్ పూజలకు’ ఏర్పాట్లు చేయండి

ఐడీఏ బొల్లారం(జిన్నారం): ఐడీఏ బొల్లారంలో వచ్చే నెలలో ఒడిశా, బిహార్ వాసులు నిర్వహించే ఛఠ్ పూజలకు అధికారిక ఏర్పాట్లు చేయాలని భాజపా విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి, జిల్లా నాయకుడు రవీందర్‌రెడ్డి కమిషనర్ మంగతాయారును కలిసి వినతిపత్రం అందించారు. విద్యుత్ లైట్లు, నీటి వసతితోపాటు పారిశుద్ధ్య సమస్య లేకుండా సహకరించాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

వట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మర్వెల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజాసంక్షేమం, అభివృద్ధి పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శంభీరెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలి

నారాయణఖేడ్: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ఖేడ్ మండల నోడల్ అధికారి మన్మథకిషోర్ కోరారు. నిజాంపేట మండలం ర్యాలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ సహకారంతో శ్రీకర ఫౌండేషన్ వ్యవస్థాపకులు వినూష సమకూర్చిన బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం నాగసుజాతారాణి, నిజాంపేట ఎంఈవో రాములు, ఖేడ్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

సంగారెడ్డి గ్రామీణ: ఫసల్వాదీ గ్రామంలో జాతీయ సేవా పథకం ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం మూడోరోజుకు చేరుకుంది. గ్రామంలోని పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని గణపతి చక్కెర పరిశ్రమను సందర్శించి తయారీ, ఉత్పత్తి సంబధిత వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వాహకులు ఉపేందర్, శ్రీరంజిత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం: సీపీఎం

సదాశివపేట: సమస్యల పరిష్కారం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పేటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్‌లో సీపీఎం పార్టీ జిల్లా మూడో మహాసభలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు శుక్రవారం స్థానికంగా పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏరియా కార్యదర్శి రాంచందర్, మహిపాల్ ఉన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి

రాయికోడ్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టి ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పాలని బీసీ కార్పొరేషనన్ జిల్లా అధికారి జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడేఫ్రైడే కార్యక్రమంలో సిరూర్, దౌల్తాబాద్, మహబత్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. రాయికోడ్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఎంపీవో అంజలిదేవి, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, ఏపీఓ రమేశ్, అధికారులు దేవయ్య తదితరులున్నారు.

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబం శుక్రవారం రోజున డ్రైడే పాటించి రోగాలకు దూరంగా ఉండాలని జహీరాబాద్ మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ భిక్షపతి అన్నారు. సత్వార్‌లో ఎంపీడీవో మహేందర్‌రెడ్డితో కలిసి ‘డ్రైడే ఫ్రైడే’ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మురుగు కాల్వల శుభ్రత పాటించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడారు.

దుకాణ యజమానితో చెత్త తొలగింపు



చెత్తను ఎత్తుతున్న ఓ దుకాణ యజమాని

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని సువర్ణ శెట్కార్ టాకీసు రోడ్డుపై ఓ దుకాణం యజమాని శుక్రవారం సాయంత్రం చెత్తను వేశాడు. గమనించిన పురపాలిక పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ ఆ దుకాణ యజమానితో చెత్తను ఎత్తివేయించారు. మరోసారి చెత్తవేస్తే జరిమానాతోపాటు తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెత్తను సాయంత్రం వచ్చే ఆటోల్లో మాత్రమే వేయాలని ఆయన సూచించారు.

పాదయాత్రికులకు పండ్ల పంపిణీ



పాదయాత్రికులతో రాకేష్‌షెట్కార్ తదితరులు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవనీమాతను దర్శించుకునేందుకు ఖేడ్ నియోజకవర్గానికి చెందిన యువకులు పాదయాత్రగా బయలుదేరగా శుక్రవారం మహారాష్ట్రలోని ఉమార్గా వద్ద సురేష్‌షెట్కార్ సేవాసమితి ఆధ్వర్యంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్ వారిని కలిసి పండ్లు పంపిణీ చేశారు. నాయకులు సంతోష్, మహాలింగ్, పండరిచారి, సంగమేష్, సాయిచరణ్, జగన్, సోఫిరహిమాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారితో కలిసి తుల్జాపూర్ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాలిక మృతికి వైద్యుడే కారణమని బాధితుల ధర్నా!



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

కల్హేర్, న్యూస్‌టుడే: కల్హేర్‌కు చెందిన చాకలి ఓంకార్- అనితల మూడు నెలల కూతురు ఆరాధ్య మృతికి కల్హేర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కారణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న పాపకు ఇంజక్షన్ చేసి.. పరిస్థితి విషమించిందని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో బాన్సువాడ ఆస్పత్రికి వెళ్లేసరికే మృతిచెందినట్లు వారు వాపోయారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యుల ఆందోళనతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనపై వైద్యుడు అనిల్‌రెడ్డి ‘న్యూస్‌టుడే’ ప్రతినిధితో మాట్లాడుతూ...పాపకు శ్వాస సంబంధమైన సమస్యలున్నాయని, ఆస్పత్రికి రాగానే వెంటనే సీపీఆర్ చేయగా.. రెండుసార్లు స్పందన వచ్చిందని, మూడోసారి శ్వాసరేటు తగ్గుముఖం పట్టడంతో ఇద్దరు ఏఎన్‌ఎంలు, అంబులెన్సు ఇచ్చి మెరుగైన చికిత్స నిమిత్తం పంపినట్లు పేర్కొన్నారు. తాను చేసిన చికిత్స, ఇచ్చి మందులు ఎక్కడైనా చెబుతానని, వైద్యం చేయడంలో నిర్లక్ష్యం, పొరపాటు జరగలేదని వైద్యుడు పేర్కొన్నారు.

ఎర్రరాయి వాహనం స్వాధీనం

పైడిగుమ్మల్(కోహీర్): పైడిగుమ్మల్ సమీపం నుంచి ట్రాక్టరు ట్రాలీలో ఎర్రరాయిని తరలిస్తున్న వాహనాన్ని జప్తుచేసి నాగిరెడ్డిపల్లికి చెందిన జంగిలి నవీన్‌కు రూ.5 వేలు జరిమానా విధించామని తహసీల్దార్ బాలశంకర్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడితే అక్రమార్కులు ఎంతటివారైనా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత

జిన్నారం: వావిలాలలో విద్యుదాఘాతంతో నందిగామ కృష్ణ, వీరేశ్, లక్ష్మీల మూడు గేదెలు మృతిచెందడంతో రైతులకు రూ.లక్షల నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని ఏఈ వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ ప్రభాకర్ పరిశీలించి పంచనామా చేశారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

సదాశివపేట: గంజాయి రవాణా కేసులో గతంలో అరెస్టయి తప్పించుకు తిరుగుతున్న ఒరిస్సాకు చెందిన నిందితుడు చంద్రు రావును పోలీసులు తిరిగి అరెస్టు చేశారు. శుక్రవారం రిమాండుకు పంపినట్లు సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు.